బుధవారం చర్లపల్లి జైలులో డీజీ సౌమ్యమిశ్రాతో ఆనందాన్ని పంచుకుంటున్న జైలు నుంచి విడుదలైన ఖైదీ

భావోద్వేగంతో బంధువుల చెంతకు

సత్ప్రవర్తన కింద 213మంది ఖైదీల విడుదల • చర్లపల్లి సెంట్రల్ జైలు వద్ద ఉద్విగ్న వాతావరణం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ)/చర్లపల్లి: రాష్ట్రవ్యాప్తంగా వివిధ జైళ్లలో ఉన్న 213 మంది ఖైదీలను సత్ప్రవర్తన కింద రాష్ట్రప్రభుత్వం ముందస్తుగా బుధవారం విడుదల చేసింది. వీరికి చర్లపల్లి సెంట్రల్ జైలు ప్రాంగణంలో కౌన్సెలింగ్, జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ జైళ్ల నుంచి బృందాలుగా ఖైదీలను అక్కడికి తీసుకురాగా, తమ కుటుంబసభ్యులు, బంధువులను చూసి ఒక్క సారిగా భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ జైళ్లశాఖ చరిత్రలో ఇది మైలురాయి అని అభివర్ణించారు. కాగా బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ద్వారా 23మంది ఎంఏ, 35 మంది ఎమ్మెస్సీ పాసయ్యారు.

ఉస్మానియా దవాఖానలోనూ కరెంట్ కోత

హైదరాబాద్ (సుల్తాన్ బజార్), జూలై 3: రాష్ట్రంలో కరెంట్ కోతలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఉస్మానియా దవాఖానలో బుధవారం మధ్యాహ్నం సుమారు అరగంట పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ కూడా పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చివరికి విద్యుత్తు అధికారులు కరెంట్‌ను పునరుద్ధరించడంతో ఊపిరిపీల్చుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో చోటుచేసుకున్న చిన్న లోపం కారణంగానే విద్యుత్తు సరఫరా నిలిచిపోయిందని దవాఖాన సూపరింటెండెంట్ నాగేందర్ చెప్పడం గమనార్హం.

మెదక్ జిల్లా రామతీర్థం సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన గిరిజన రైతులు

సబ్ స్టేషన్ ముట్టడించిన గిరిజన రైతులు

మూడు రోజులుగా త్రీఫేజ్ కరెంట్ కట్

మెదక్ జిల్లా రామతీర్థంలో రైతుల ఆందోళన

పాపన్నపేట, జూలై 3 : మూడు రోజులుగా రెండు గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్ రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామంటూ మెదక్ జిల్లా మొదలకుంట, నర్సింగరావుపల్లి గిరిజన తండాల రైతులు బుధవారం పాపన్నపేట మండలం రామతీర్థం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. సబ్‌స్టేషన్‌కు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఈ నిర్లక్ష్యం కారణంగా నర్సింగరావుపల్లి, మొదలకుంట తండాలకు విద్యుత్తు సరఫరా కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనేగల రామతీర్థం, మల్లంపేట గ్రామాలకు త్రీఫేజ్ ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

గ్రేటర్ వరంగల్ బల్దియాలో కరెంట్ కటకట

- **గంటపాటు నిలిచిన పౌరసేవలు**

వరంగల్, జూలై 3: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు గంటపాటు పౌరసేవలు నిలిచిపోయాయి. రోజూ వందలాది మంది వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారు. మధ్యాహ్నం సమయంలో కరెంట్ లేకపోవడంతో పౌరసేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రజాపాలన దరఖాస్తుల సవరణల కోసం రోజూ ఉదయం నుంచే వందలాది మంది ప్రధాన కార్యాలయ కౌంటర్ వద్ద బారులు తీరుతున్నారు. ఇదే సమయంలో కరెంట్ లేక జనరేటర్ పనిచేయక పోవడంతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు మరమ్మతులు చేపట్టారు.

ముందు బిల్లులే.. తర్వాత బాదుడే!

- **'పవర్' ప్రైవేటీకరణలో తొలి అడుగే**
- **హైదరాబాద్ పాతబస్తీలో కరెంటు బిల్లింగ్ అదానీకి!**
- **2008లో ముంబైలోనూ ఇలాగే చొరబడిన కంపెనీ**
- **అలా క్రమంగా ఏడు ప్రధాన డివిజన్లపై గుత్తాధిపత్యం**
- **టారిఫ్‌లు పెంచుతూ, సేవా రుసుము పేరిట ప్రజలపై వాత**
- **భవిష్యత్తులో హైదరాబాదీలకూ తప్పని ముప్పు: విశ్లేషకులు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): 'ఇసుంట రమ్మంటే ఇల్లంతా నాదే' అన్నట్టుంటది అదానీ తీరు. ముంబైలో విద్యుత్తు బిల్లుల వసూళ్ల కాంట్రాక్ట్ సంపాదించిన అదానీ గ్రూప్ ఇప్పుడు విద్యుత్తుపై గుత్తాధిపత్యం సాధించింది. ఇకపై తెలంగాణలోనూ ఇవే పరిస్థితులు ఉంటాయన్నది విమర్శకుల మాట. హైదరాబాద్‌లోని పాతబస్తీలో విద్యుత్తు బిల్లుల వసూలు బాధ్యతను అదానీ గ్రూప్ కంపెనీకి అప్పగించినట్టు ఇటీవల ఢిల్లీలో జరిగిన మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్యుత్తు వ్యవస్థ పైవేటీకరణకు దీనిని తొలి అడుగుగా అభివర్ణిస్తున్నారు.

అసలు ముంబైలో ఏమైంది?

అదానీ పవర్ పేరిట అప్పటికే దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విద్యుదుత్పత్తి కేంద్రాలు స్థాపించిన అదానీ గ్రూప్ సెప్టెంబర్ 18, 2008లో అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్‌ను ప్రారంభించింది. ముంబై మహానగరంలోని దాదాపు 30 వేల జనాభా ఉన్న ప్రాంతానికి విద్యుత్తు బిల్లుల వసూళ్లకు సంబంధించిన కాంట్రాక్ట్‌ను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. అలా పదేండ్లలో ముంబైలోని 400 చదరపు కిలోమీటర్ల పరిధిలో అంధేరీ, వండ్రే, మీరా భైందర్, బోరివాలీ, మలాడ్, పోవాయి, చెంబూరు వంటి ఏడు పెద్ద డివిజన్లలో దాదాపు 31 లక్షల మందికి విద్యుత్తు సరఫరా, చార్జీల వసూలు, మరమ్మతులు.. ఇలా ప్రతీ కాంట్రాక్ట్‌ను అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ దక్కించుకొన్నది. దీని కోసం 2018లో అప్పటి బీజేపీ ప్రభుత్వం సహకారంతో మహారాష్ట్ర ఈస్టర్న్ గ్రిడ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (ఎంఈజీపీటీసీఎల్), మహారాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(ఎంఈఆర్సీ)తో పలు ఒప్పందాలను కుదుర్చుకొన్నది. అలా ఈ ఏడు ప్రాంతాలపై విద్యుత్తు గుత్తాధిపత్యం ఆ కంపెనీ సొంతమైంది.

చార్జీల బాదుడు షురూ..

31 లక్షల జనాభా ఉన్న ప్రాంతంపై గుత్తాధిపత్యం సాధించిన అనంతరం సామాన్యులపై అదానీ కంపెనీ బాదుడు మొదలుపెట్టింది. ఫ్యూయెల్ అడ్జస్ట్‌మెంట్ చార్జీల పేరిట గడిచిన ఆరేండ్లలో ఎనిమిదిసార్లు విద్యుత్తు చార్జీలు పెంచింది. తాజాగా గత మేలో ఒక్కో యూనిట్‌పై రూ. 1.70 వడ్డించింది. బిల్లుల చెల్లింపుల్లో ఏమాత్రం ఆలస్యం జరిగినా కనెక్షన్‌ను కట్ చేయడం, పునరుద్ధరణ సర్వీసు చార్జీల పేరిట వసూళ్లకు తెగబడడం నిత్యకృత్యంగా మారింది. అంతేకాదు, గాలివానలు, కోతుల కారణంగా విద్యుత్తు తీగలు తెగిపడినా, మరే ఇతర కారణంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడినా దానికీ సేవా రుసుములను వసూలు చేస్తున్నది. దీన్ని నిరసిస్తూ వినియోగదారులు ఇటీవల ఎంఈఆర్సీని ఆశ్రయించగా, సదరు కమిషన్ అదానీ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ, వాటికి స్పందించకుండా చార్జీల పరంపరను కొనసాగిస్తున్నది. ఒక్కో సమయంలో కరెంటుకు ఒక్కో టారిఫ్‌ను వసూలు చేయడం, ఎవరు ఎంత కరెంటు కాలుస్తున్నారన్న విషయాన్ని తెలుసుకోవడానికి 10.8 లక్షల ఇండ్లల్లో స్మార్ట్‌మీటర్లను ఇన్‌స్టాల్ చేయడానికి ప్రయత్నించడం వంటివాటిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తర్వాత హైదరాబాద్‌లోనే?

నిబంధనలకు విరుద్ధంగా ముంబైవాసుల ముక్కుపిండి అదనపు చార్జీలు వసూలు చేస్తున్న అదానీ కంపెనీకి పాతబస్తీ ప్రాంతానికి సంబంధించి బిల్లింగ్ వ్యవస్థను అప్పగించడం సామాన్యుల నడ్డివిరగ్గొట్టడమేనని విద్యుత్తు రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలుత బిల్లింగ్ కోసమంటూ ముంబైలో ప్రవేశించిన అదానీ కంపెనీ.. ఆ తర్వాత చార్జీల వాత పెడుతూ కరెంటుపై పెత్తనాన్ని సాగించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. రేప్పొద్దున ఇదే పరిస్థితి హైదరాబాద్‌లోనూ రావొచ్చని హెచ్చరిస్తున్నారు. విద్యుత్తు బిల్లుల వసూలు బాధ్యతను అదానీ గ్రూప్ కంపెనీకి అప్పగించాలన్న నిర్ణయాన్ని రేవంత్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మన దగ్గర ఏమవ్వొచ్చు?

- తొలుత హైదరాబాద్‌లో విద్యుత్తు పంపిణీ వ్యవస్థను అదానీ గ్రూప్ ఫ్రాంచైజీలుగా విడగొట్టొచ్చు.
- ఏరియా ప్రాతిపదికన ఇండ్లను విడగొట్టి విద్యుత్తు సరఫరా, బిల్లుల చార్టులను రూపొందించవచ్చు.
- ముందుగా బిల్లులు వసూలు చేసి, అనంతరం లోపభూయిష్ట ఒప్పందాలు చేసుకొని వసూళ్లతో పాటు కరెంటు సరఫరా, టారిఫ్‌ల నిర్ణయం ఇలా అన్నింటిమీద గుత్తాధిపత్యం సాధించవచ్చు.
- అంటే విద్యుత్తు లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను అదానీ గ్రూప్ ఆధీనంలోకి తీసుకోవచ్చు.
- ఒకవేళ ఇదే జరిగితే, కొత్త కనెక్షన్లు కావాల్సివచ్చినా, విద్యుత్తు సరఫరాలో సమస్యలు తలెత్తినా సేవా రుసుము పేరిట వాత పెట్టొచ్చు. కరెంటు టారిఫ్‌లను ఎడాపెడా పెంచొచ్చు.
- స్మార్ట్ మీటర్లు బిగించి ఎవరికి ఎంత కరెంటు అవసరం? పీక్ అవర్లలో విని యోగం ఎక్కువ ఉన్నవారి నుంచి ఎక్కువ ఛార్జీలు విధించడం వంటి చర్యలు తీసుకోవచ్చు. ఇవన్నీ ఇప్పుడు ముంబైలో జరుగుతున్నవే.
- ఒకవేళ ఇదే జరిగితే హైదరాబాదీల నెలవారీ కరెంటు బిల్లు అమాంతం పెరిగిపోవచ్చు. సేవల్లో అంతరాయానికి త్వరితగతిన పరిష్కారం లభించక పోవచ్చు. ఏ చిన్న మరమ్మతు అవసర పడినా సేవా రుసుమును చెల్లించాల్సిందే.

కార్మికులకు వేతనాలు ఇస్తలేరు

- **జీవో 60ని అమలు చేయాలి**
- **హైదరాబాద్‌లో ఏఐటీయూసీ ధర్నా**

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. జీవో 60, కాంట్రాక్ట్ కార్మిక చట్టాలను అమలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్ల తీరును నిరసిస్తూ హైదరాబాద్ కోఠిలోని డీఎంఈ కార్యాలయం ఎదుట బుధవారం శానిటేషన్ పేషంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, 2022లో టెండర్ పిలిచినప్పుడు వారికి జీవో 60 ప్రకారం రూ.13,600 జీతం చెల్లిస్తామని చెప్పారని గుర్తుచేశారు. కానీ, అలా వేతనాలు చెల్లించకుండా కార్మికులను కాంట్రాక్టర్లు, అధికారులు దోచుకుంటున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ఓమయ్య, తోట రామాంజనేయులు, తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యదర్శులు పీ సురేశ్, ఎస్ కిష్టమ్మ, ఏఐటీసీ నాయకులు సిర్రా దేవేందర్, వినోద్, జె లక్ష్మి, సర్వేశ్వర్, మదన్‌సింగ్ పాల్గొన్నారు.

రేపటి నుంచే బదిలీలకు

మొదటిపేజీ తరువాయి...

పరిగణనలోకి తీసుకుంటారు.

- గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల బదిలీలకు సంబంధించిన నిబంధనలు పాటించాలి.
- హెచ్‌వోడీలు/అధీకృత ఉన్నతాధికారులు వారి పరిధిలో బదిలీకి అర్హులైన ఉద్యోగుల జాబితాను, ఖాళీల జాబితాను ప్రకటించాలి. అనంతరం ఉద్యోగుల నుంచి ఆప్షన్లు స్వీకరించాలి. ఒక్కో ఉద్యోగి 5 ఆప్షన్లు ఇవ్వవచ్చు.
- కచ్చితంగా బదిలీ కావాల్సిన ఉద్యోగుల జాబితాను రూపొందించాలి.
- బదిలీల సమయంలో తమ కార్యాలయంలో సరిపడా సిబ్బంది ఉండేలా హెచ్‌వోడీలు చర్యలు తీసుకోవాలి.
- కఠిన ప్రాంతాలకు వెళ్లేందుకు ఆప్షన్ ఇవ్వకుంటే లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాలి.
- టీచర్లు, లెక్చరర్లు, ఆదాయాన్ని ఇచ్చే శాఖలు(వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా, అటవీ, పోలీస్ విభాగాలకు సంబంధించి ఆయా శాఖలకు గతంలో ఉన్న ప్రత్యేక మార్గదర్శకాలను పాటించాల్సి ఉంటుంది.
- రాష్ట్ర, మల్టీజోనల్, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే కమిటీల ఆధ్వర్యంలో బదిలీలు జరుగుతాయి. రాష్ట్ర స్థాయి క్యాడర్‌కు సంబంధించి ఆయా శాఖల ప్రత్యేక కార్యదర్శి/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి, హెచ్‌వోడీ, అడిషనల్/జాయింట్/డిప్యూటీ సెక్రటరీతో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తారు. మల్టీజోనల్ స్థాయి కమిటీలో హెచ్‌వోడీ, అడిషనల్/జాయింట్/డిప్యూటీ సెక్రటరీ, రీజినల్ ఆఫీసర్ లేదా అడిషనల్/జాయింట్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. జిల్లా స్థాయికి సంబంధించి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్/డీఆర్వో, ఆ శాఖ జిల్లా అధికారి సభ్యులుగా ఉంటారు.
- బదిలీ అయిన ఉద్యోగి మూడు రోజుల్లోగా రిలీవ్ కావాల్సి ఉంటుంది.
- మొత్తం బదిలీ ప్రక్రియను ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్య కార్యదర్శి/కార్యదర్శి పర్యవేక్షించాలి.

ఎన్నికలప్పుడు బదిలీ అయిన వారికి అవకాశమివ్వాలి: టీజీవో

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు బదిలీ అయిన ఉద్యోగులకూ బదిలీల్లో అవకాశమివ్వాలని టీజీఓ కేంద్ర సంఘం విజ్ఞప్తి చేసింది. సాధారణ బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను పాటించకుండా కేవలం ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం వారిని బదిలీ చేశారని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలా బదిలీ అయినవారి ఇబ్బందులు గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

బదిలీలపై నిషేధం ఎత్తివేత హర్షణీయం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఎత్తివేత హర్షణీయమని తెలంగాణ పంచాయతీ కార్యదర్శి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు. జూన్ 30 వరకు 317 జీవో సబ్ కమిటీకి సుమారు 50 వేల వరకు అన్ని శాఖల ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని, జూలై 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు ప్రక్రియ జరుగుతుందని వెల్లడించారు.

రేపు 'టీజీపీఎస్సీ' ముట్టడి

- **దిగిరాని సర్కారు.. పట్టువదలని నిరుద్యోగులు**
- **'చలో టీజీపీఎస్సీ'కి పిలుపు.. ప్రతిపక్షాల మద్దతు**
- **పెద్ద సంఖ్యలో కదంతొక్కేందుకు సన్నాహాలు**
- **కొనసాగుతున్న ఆమరణ నిరాహార దీక్షలు**

ప్రతి పక్షాలు, విద్యార్థి సంఘాల మద్దతు

ఈ నెల 5న 'హలో నిరుద్యోగి.. చలో టీజీపీఎస్సీ ముట్టడి'కి బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయి. నిరుద్యోగులకు అండగా ఉంటామని స్పష్టం చేశాయి. విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారామ్ యాదవ్ నిరుద్యోగుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : ఉద్యోగాల కోసం నిరుద్యోగుల పోరాటం ఉధృతమవుతున్నది. రోడ్డెక్కి ధర్నాలు, ఆందోళనలు, నిరాహారదీక్షలు చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈ నెల 5న టీజీపీఎస్సీ ముట్టడికి ఉద్యోగార్థులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేలాది సంఖ్యలో పాల్గొనేందుకు సన్నాహాలు చేస్తున్నారు. డిమాండ్ల నెరవేర్చేందుకు గురువారం వరకు గడువు అని అల్టిమేటం జారీచేశారు. ప్రభుత్వం దిగిరాకుంటే నిరుద్యోగుల ధర్నా తప్పదని హెచ్చరిస్తున్నారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి అమలు, గ్రూప్ 2, 3, డీఎస్సీలో పోస్టుల పెంపు వంటి డిమాండ్లపై ప్రభుత్వం దిగిరావాలని డిమాండ్ చేస్తున్నారు.

కొనసాగుతున్న దీక్షలు

నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్, అశోక్ ఇద్దరూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. వారిని హౌస్‌అరెస్టు చేసినా ఇంటినుంచే దీక్ష కొనసాగిస్తున్నట్టు ప్రకటించారు. ఇద్దరి ఇండ్ల వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించారు.

ఏ సొసైటీకి అలాటయ్యారో ప్రకటించని ట్రిబ్

- **ఆందోళనలో దివ్యాంగ అభ్యర్థులు**

హైదరాబాద్, జూలై3 (నమస్తే తెలంగాణ): మొన్నటివరకు ఫలితాలను ప్రకటించకుండా మానసిక ఆవేదనకు గురి చేసిన తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్), ఇప్పుడు సరైన సమాచారమివ్వకుండా దివ్యాంగ అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్నది. డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులకు ఇటీవల మెరిట్ జాబితాలను వెల్లడించింది. అయితే ఆయా అభ్యర్థులు ఏ సొసైటీలకు అలాటయ్యారనే జాబితాను మాత్రం వెబ్‌సైట్‌లో పొందుపరచలేదు. బీసీ, ట్రైబల్, మైనార్టీ సొసైటీలు ఇప్పటికే ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు మెసేజ్‌లను పంపడంతో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను కూడా నిర్వహించాయి. సోషల్ వెల్ఫేర్ సొసైటీ సైతం అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు షెడ్యూల్ ప్రకటించింది. అయితే 1:1 మెరిట్ జాబితాలో ఉన్నా కూడా పలువురికి ఇప్పటివరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం రాలేదు. తాము ఏ సొసైటీకి ఎంపికయ్యామో? అనే విషయం కూడా తెలియకుండా పోయిందని దివ్యాంగ అభ్యర్థులు వాపోతున్నారు.

బొగ్గుగనుల వేలాన్ని రద్దు చేయాలి

- **సింగరేణి వ్యాప్తంగా బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆందోళన**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తాలో బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, (నమస్తేతెలంగాణ) జూలై 3: బొగ్గుగనుల వేలాన్ని రద్దు చేయాలంటూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు కదం తొక్కారు. ఈ నెల 1న అన్ని బొగ్గుగనుల కార్మికులతో కలిసి నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం.. బుధవారం పెద్దపల్లి జిల్లాలోని సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ 1, 2, 3లో భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలతో ఆందోళన చేసింది. గోదావరిఖని చౌరస్తాలో టీబీజీకేఎస్ ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో, రామగుండం డివిజన్-2లోని యూనియన్ కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆర్జీ-2 డివిజన్ ఉపాధ్యక్షుడు అయిలీ శ్రీనివాస్, సెంటినరీ కాలనీలోని తెలంగాణ చౌరస్తాలో టీబీజీకేఎస్ ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఈ సందర్భంగా బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులతో కుమ్మక్కై బొగ్గు గనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు వేగంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలోని బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మాత్రమే తవ్వి తీయాలని డిమాండ్ చేశారు. ఇతర ఏ ప్రైవేట్ వ్యక్తులకు గనులను కేటాయించినా సహించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలకు ఉపాధినిచ్చే సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి కార్మిక సంఘాలు, ప్రజలు, రాజకీయ పార్టీలు ఐక్యంగా ముందుకొచ్చి పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు దండిగాల రాజేందర్ మాట్లాడుతూ.. బొగ్గు గనుల వేలం ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్టు తెలిపారు.

గనుల వేలాన్ని విరమించండి

- **కార్మిక సంఘాల ఐక్యవేదిక**

ఖైరతాబాద్, జూలై 3 : కేంద్రం బొగ్గు గనుల వేలం నుంచి తెలంగాణ బ్లాకును తొలగించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక వక్తలు డిమాండ్ చేశారు. సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహజ వనరుగా ఉన్న బొగ్గును ప్రైవేట్‌పరం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మండిపడ్డారు. హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్రం తీసుకువచ్చిన నూతన పాలసీతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఏఐఎఫ్‌టీయూ గౌరవాధ్యక్షురాలు విమలక్క తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీపై అటవీ శాఖలో కదలిక

- **రాజీ కోసం కిందిస్థాయి అధికారుల జోక్యం!**
- **సార్ తప్పులేదని చెప్పాలని బెదిరింపులు!**

ములుగు, జూలై 3 (నమస్తేతెలంగాణ): ములుగులోని అటవీ శాఖలో బంగ్లా వాచర్‌గా పనిచేస్తున్న గట్టికొప్పుల భాగ్యలక్ష్మిని డీఎఫ్‌వో తన ఇంట్లో సరిగా పనిచేయడం లేదని సస్పెండ్ చేసిన ఘటన ఆ శాఖలో తీవ్ర కలకలం రేపింది. 'ఇంట్లో పనిచేస్తలేదని సస్పెన్షన్ వేటు' అనే శీర్షిక బుధవారం' నమస్తేతెలంగాణ'లో ప్రచురితమైన కథనం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బుధవారం బంగ్లా వాచర్‌ను కిందిస్థాయి అధికారులు ములుగులోని ఫారెస్టు కార్యాలయానికి పిలిపించి రాజీ కుదుర్చేందుకు యత్నించినట్టు తెలిసింది. 'నీ సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే పోస్టింగ్ ఇస్తాం. పెద్ద సారుకు చెడ్డపేరు రాకుండా ఉండేందుకు.. ఆయన తప్పేమీ లేదు. నేనే కావాలని సార్ మీద తప్పుడు మాటలు చెప్పిన' అని మీడియా ముందు ఒప్పుకోవాలని బెదిరించినట్టు తెలుస్తున్నది. తనకు జరిగిన అన్యాయం జరిగినప్పుడు ఏ అధికారి అండగా నిలవలేదని, తన ఆవేదనను కార్యాలయానికి వచ్చిన మీడియాకు వివరించానని, నిజాన్ని నిర్భయంగా చెప్పుతానని, అసత్యపు మాటలు తాను మీడియాకు చెప్పే ప్రసక్తే లేదని, పోస్టింగ్ ఎప్పుడు ఇస్తారో ఇవ్వండి అని వెనక్కి తగ్గేది లేదని బాధితురాలు తెగేసి చెప్పినట్టు సమాచారం.

న్యాయం చేస్తాం: డీఎఫ్‌వో

భాగ్యలక్ష్మి సస్పెండ్ విషయంలో సముచిత న్యాయం చేస్తామని జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్‌జాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆరోపించినట్టు తాను ఎలాంటి సొంత పనులు చేయించుకోలేదని పేర్కొన్నారు. మీడియా ముందు ఇష్టానుసారంగా ఆరోపణలు చేయడం తగదని ఆయన సూచించారు.

గురుకులాలకు కామన్ టైమ్‌టేబుల్

ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకుల సొసైటీలన్నింటికీ